

అనుదినం.. జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
08 పేజీలు | మంగళవారం 07 నవంబర్ 2023 | www.navatelangana.com

నా రాజకీయ జీవితం ప్రజల కోసమే

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- నా భర్త ప్రాణం కాపాడిన మంచి వ్యక్తి స్పీకర్ : స్థానికురాలు

4లో..



ప్రజా సమస్యల్ని పరిష్కరించే వారికి ఓటు వేయాలి

- సీపీఐ(ఎం) డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్

3లో..



కామారెడ్డిలో చెల్లని రూపాయి..
ఇక్కడ చెల్లుతుందా..?

- నిజామాబాద్ అర్బన్‌లో షబ్బీర్ అలీ పోటీపై ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ అర్బన్ నుంచి కాంగ్రెస్ తరఫున షబ్బీర్ అలీ పోటీ చేయడంపై కవిత స్పందించారు. కామారెడ్డిలో చెల్లని రూపాయి నిజామాబాద్ ఎలా చెల్లుతుందన్నది ప్రజలు ఆలోచించాలని కోరారు. కామారెడ్డి నుంచి పారిపోయి వచ్చిన వ్యక్తిని నిజామాబాద్‌లో ఆదరిద్దామా అన్నదానిపై ప్రజలు ఆలోచన చేయాలని పిలుపునిచ్చారు. షబ్బీర్ అలీ గతంలో గంప గోవర్ధన్ చేతిలో నాలుగు సార్లు ఓడిపోయారని, ఇప్పుడు గణేష్ గుప్త చేతిలో మరోసారి ఓడిపోతారని అన్నారు. అంతకుమించి షబ్బీర్ అలీతో అయ్యేది ఏమీ లేదని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎవరన్నది చింతించాల్సిన అవసరం తమకు లేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కుల మతాల మధ్య ఎలా చిచ్చు పెడుతున్నదో అన్నదానిపై ప్రజల్లోకి తీసుకెళ్తామని వివరించారు. బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి, కాంగ్రెస్ పార్టీ ప్రజలను మభ్యపెట్టిన విధానాన్ని ప్రజలకు వివరించి మెప్పిస్తామని, నిజామాబాద్ అర్బన్‌లో మరొకసారి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే గణేష్ గుప్త భారీ మెజారిటీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

మూడో రోజు
26 నామినేషన్‌లు

- నిజామాబాద్‌లో 12, కామారెడ్డి జిల్లాలో 14 నామినేషన్‌లు దాఖలు


నామినేషన్ దాఖలు చేస్తున్న వేముల ప్రశాంత్‌రెడ్డి


షబ్బీర్‌అలీ తరఫున నామినేషన్ దాఖలు చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కామారెడ్డి

నామినేషన్‌ల పర్వం కొనసాగుతోంది. గడువు తేదీ ముంచుకొస్తుండటంతో అభ్యర్థులు పోటాపోటీగా నామినేషన్‌లు వేస్తున్నారు. వారం, వర్జ్యం చూసుకొని నామినేషన్‌లు వేస్తుండటం గమనార్హం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9 నియోజకవర్గాలకు గాను సోమవారం మూడో రోజు 26 నామినేషన్‌లు దాఖలు అయ్యాయి.

నిజామాబాద్ సిటీ : నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆరు నియోజకవర్గాల్లో సోమవారం మూడవ రోజు 12 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆర్మూర్‌లో మ్యాకల గంగాధర్ ఇండిపెండెంట్ అభ్యర్థి, ఉత్తర రాష్ట్ర తెలంగాణ పార్టీ అభ్యర్థి సాయన్న బానోత్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి టి.వినోద్ కుమార్ కు నామినేషన్లు దాఖలు చేశారు.

బోధన్‌లో ఆల్ ఇండియా మజ్లీస్ ఈ ఇంకిలాబ్ ఈ మిలాత్ పార్టీ తరఫున మహ్మద్ షర్జీల్ పర్వేజ్ , బీజేపీ అభ్యర్థి వడ్డి మోహన్ రెడ్డి రిటర్నింగ్ అధికారి బి.రాజాగౌడ్ కు నామినేషన్ దాఖలు చేశారు.

బాన్సువాడలో ఇండిపెండెంట్ అభ్యర్థి పుట్ట భాస్కర్, కాంగ్రెస్ అభ్యర్థి కాసుల బాలరాజు, కాంగ్రెస్ అభ్యర్థి కాసుల రోహిత్ రిటర్నింగ్ అధికారి భుజంగరావు నామినేషన్లు దాఖలు చేశారు. నిజామాబాద్ అర్బన్‌లో ఇండిపెండెంట్ అభ్యర్థి మహ్మద్ జహీరుద్దీన్, కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ ఆలీ షబ్బీర్ తరఫున నగర కాంగ్రెస్ అధ్యక్షులు కేశ వేణు రిటర్నింగ్ అధికారి ఎం.మకరంద్‌కు నామినేషన్ దాఖలు చేశారు. మిగతా 2లో...

ఎన్నికలొచ్చినప్పుడే బీసీలపై ప్రేమ

- బీసీ కులగణన ఎందుకు చేపట్టడం లేదు..?
- అధికారంలోకి రాని బీజేపీ.. బీసీని ఎలా సీఎం చేస్తుంది..!
- బీసీ డిక్లరేషన్‌తో కాంగ్రెస్ చేసిన పాపాలు పోవు : ఎమ్మెల్సీ కవిత

2లో..



నామినేషన్ పత్రాలు నింపడంలో
సహకరించాలి

- హెల్ప్‌డెస్క్ సిబ్బందితో జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

నామినేషన్ పత్రాలు తిరస్కరణకు గురికా కుండా నామినేషన్ పత్రాలు నింపడంలో అభ్యర్థులకు తగు సలహాలు, సూచనలు అందించ వలసినదిగా జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్ రెవెన్యూ సిబ్బందికి సూచించారు. సోమవారం కామారెడ్డి తహసీల్దార్ కార్యాలయం నందు ఫెసిలిటేషన్ సెంటర్ (హెల్ప్ డెస్క్) లో ఏర్పాటు చేసిన వివిధ కౌంటర్‌లను ఎస్పీ సింధు శర్మతో కలిసి పరిశీలిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభ్యర్థులు ఫారం-2 బి లో నామినేషన్ పత్రం సమర్పించాలని, నామినేషన్ పత్రంలోని ప్రతి కాలం తప్పనిసరిగా నింపారో లేదో పరిశీలించాలన్నారు.



నామినేషన్ పత్రంతో పాటు 10 రూపాయల నాన్ జ్యుడిషియల్ స్టాంప్ పేపర్ పై ఫారం - 26 అఫిడవిట్ సమర్పిం చాలని, క్రిమినల్ కేసులు ఉంటే అట్టి పూర్తి వివరాలు పొందు పరిచి ప్రమాణ పత్రం అందజేయాల న్నారు. నామినేషన్ రోజు నుండే అభ్యర్థులు ప్రత్యేక బ్యాంకు ఖాతా తెరిచి అట్టి ఖాతా నుండే ఎన్నికల ఖర్చు నిర్వహించాలని, ఖర్చు వివరాలు సంబంధిత రిటర్నింగ్ అధికారులకు అందజేయవలసి ఉంటుందని ఇట్టి విషయాల పట్ల అభ్యర్థులకు అవగాహన కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్ధార్ లత, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

టీయూలో యాంటీ ర్యాగింగ్ కమిటీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ వాకాటి కరుణ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్.యం యాదగిరి వర్సిటీలో యాంటీ ర్యాగింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. సోమవారం యూనివర్సిటీ లోని రిజిస్ట్రార్ చాంబర్లో ప్రొఫెసర్ ఎం యాదగిరి యాంటీ ర్యాగింగ్ పోస్టర్ను విడుదల చేస్తూ విద్యార్థులు శారీరిక, మానసిక, లైంగిక, ఒత్తిడికి గురి చేస్తే చట్టరీత్యా నేరస్తులు అవుతారని పేర్కొన్నారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాభివద్ధి, సమాజానికి ఉపయోగపడేలా గాని వినాశానికి ఉపయోగపడటం క్షమించరానిదని పేర్కొన్నారు.విద్యార్థులు క్రమశిక్షణతో విజ్ఞాన అభివద్ధికి ముందడుగులు వెయ్యాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తు కొరకు యాంటీ ర్యాగింగ్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కమిటీకి తెలంగాణ యూనివర్సిటీ వైస్ చాన్సర్ వకాటి కరుణ చైర్మన్‌గా వ్యవహరి స్తారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరి వైస్ చైర్మన్‌గా, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్ ఆరతి కన్వీనర్‌గా, డాక్టర్ కే రవీందర్ రెడ్డి,డాక్టర్ ఎం. బీ. బ్రమరాంబిక, డాక్టర్ జి బాలకిషన్, డాక్టర్ ఏ. పున్నయ్య, డాక్టర్ గుల్ ఈ రానా, డాక్టర్ మహేందర్ ఐలేని, డాక్టర్ కే కిరణ్మయి, డాక్టర్ కిరణ్ రాథోడ్ సభ్యులుగా నియమించారు. విద్యార్థులు ఎలాంటి అసౌకర్యానికి గురైన కమిటీ సభ్యులకు వెంటనే సమాచారం అందించాలని రిజిస్ట్రార్ పేర్కొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

మూడో రోజు 26 నామినేషన్‌లు

-మొదటిపేజీ తరువాయి

బాల్కొండ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ముత్యాల సునీల్ రెడ్డి తరపున కాంగ్రెస్ నాయకులు సుంకెట రవి నామినేషన్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్ రెడ్డి భీంగల్ మున్సిపాలిటీలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుచిత్ర మిశ్రాకు నామినేషన్ దాఖలు చేశారు. డీఎస్పీ నుంచి మంగళరం భోజన్న నామినేషన్ దాఖలు చేశారు. నిజామాబాద్ రూరల్ సోమవారం ఒక్క నామినేషన్ దాఖలు కాలేదు.

కామారెడ్డి : జిల్లాలోని మూడు నియోజకవర్గాలలో సోమవారం 14 నామినేషన్లు దాఖలయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్ తెలిపారు. కామారెడ్డి నియోజకవర్గంలో 11 మంది అభ్యర్థులు 12 నామినేషన్లు దాఖలు చేయగా జుక్కల్ నియోజక వర్గంలో బిజెపి నుండి అరుణ తార, ఎల్లారెడ్డిలో స్వతంత్ర అభ్యర్థిగా మైతారి సంజీవులు నామినేషన్ దాఖలు చేశారని కలెక్టర్ తెలిపారు. కామారెడ్డి నియోజక వర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా మడిశెట్టి తిరుపతి రెండు సెట్ల నామినేషన్ వేశారన్నారు. బిజెపి నుండి కాటిపల్లి వెంకటరమణా రెడ్డి, బీఎస్పీ నుండి ఊడ్తవార్ సురేష్ గౌడ్, ధర్మ సమాజ్ పార్టీ నుండి ఉగ్రవాయ్ బోలేశ్వర్, అల్ ఇండియా మజిల్స్-ఇంక్విలాబ్-ఇ -మిల్లత్ నుండి షేక్ అబ్దుల్ వాహెద్, స్వతంత్ర అభ్యర్థులుగా మహేందర్ రెడీ పంజెర్ల, గారెదె వెంకట రావు, కలరామ్ అశోక్ వర్ధన్, భార్గవి మంగిలిపల్లి, బరిగేలా శివ, కంతె సాయన్న లు ఒక్కో సెట్ చొప్పున నామినేషన్ పత్రాలు దాఖలు చేశారని కలెక్టర్ తెలిపారు.

అరుణతార నామినేషన్

మద్నూర్ : బీజేపీ ఎల్లారెడ్డి నియోజకవర్గ అభ్యర్థి అరుణతార మద్నూర్ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. నీళ్ల నిధులు నియామకాల పేరుతో సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని గడిచిన 10 సంవత్సరాలు కాలంలో కెసిఆర్ అప్పుల పాలు చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి రావాలని చూస్తుంది కానీ కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్యారెంటీగా ఉన్నారా అంటూ బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఇరు పార్టీలపై ధ్వజమెత్తారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న అరుణతార

న్యాయవాదికి పరామర్శ

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు పట్టణానికి చెందిన న్యాయవాది గజ్జెల బిక్షపతి కుటుంబాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సోమవారం పరామర్శించారు. న్యాయవాది తల్లి మల్లవ్వ మరణ వార్త తెలుసుకొని ఆయన నివాసంలో పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వ విప్ వెంట నాయకులు నల్లవెల్లి అశోక్, వాసవి క్లబ్ అధ్యక్షులు సుదర్శన్, తదితరులు ఉన్నారు.


పరామర్శిస్తున్న గంపగోవర్ధన్

11న హాలో మాదిగ ఛలో హైదరాబాద్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈనెల 11న జరిగే మాదిగల విశ్వరూప మహసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా, నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం, ఎల్లమ్మ గుట్టలోని మాదిగ బస్తీలో కార్యక్రమం నిర్వహించారు. వర్గీకరణ అవశ్యకత, ప్రస్తుత వర్గీకరణ ఉద్యమం, మంద కృష్ణ మాదిగ నాయకత్వం గురించి, ఎమ్మార్పీఎస్ సాధించిన విజయాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు నవీన్ మాదిగ, వినోద్ మాదిగ, శివరాజ్ మాదిగ బస్తి మాదిగ ప్రజలు పాల్గొన్నారు.

ఏసీపికి సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జి జీ ఫౌండేషన్ అధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ నివేదన్ గుజరాతి, రోటరీ క్లబ్ ఆఫ్ ఆదర్శ్ మాజి అధ్యక్షులు డీజే దయానంద్ తదితరులు పట్టణ వాసి అయిన మథనం గంగాధర్ ఇటీవలే ఏసిపిగా పదోన్నతి పొందిన శుభ సందర్భంలో వారికి పులమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఏసిపి గంగాధర్ మాట్లాడుతూ చిన్నపటి నుండి కష్టపడి చదివి ఈ స్థాయిలో రాణించడం తమ తల్లి దండ్రుల ఆశీర్వాదం అని అన్నారు. సన్మానించిన చిన్ననాటి మిత్రులకు , పట్టణ ప్రజలకు ప్రతేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జీ జీ ఫౌండేషన్ ప్రతినిధులు బెల్దారి శ్రీనివాస్, బోచ్కర్ వేణు, బొడమిధి బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.


ఏసీపీకి సన్మానం

ఎన్నికలొచ్చినప్పుడే బీసీలపై ప్రేమ

- బీసీ కులగణన ఎందుకు చేపట్టడం లేదు..?
- అధికారంలోకి రాని బీజేపీ.. బీసీని ఎలా సీఎం చేస్తుంది..!
- బీసీ డిక్లరేషన్‌తో కాంగ్రెస్ చేసిన పాపాలు పోవు
- మాది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదు బీసీల ప్రభుత్వం
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కవిత



నవతెలంగాణ-కంఠేశ్వర్

బీసీ కులగణన ఎందుకు చేపట్టడంలేదో కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కుల వృత్తులకు చేయూతనివ్వకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బీసీల జీవితాలతో ఆడుకుంటుందని ధ్వజమెత్తారు. బ్యాక్లాగ్ పోస్టులు భర్తీ ఎందుకు చేయడం లేదని, ఓబీసీ రిజర్వేషన్లను ఎందుకు సక్రమంగా అమలు చేయడం లేదని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. దేశంలో బీసీలకు ఇంత అన్యాయం జరుగుతున్న కూడా ప్రశ్నించకుండా కాంగ్రెస్ పార్టీ పనికిరాని ప్రతిపక్ష పార్టీగా మారిందని మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించిరాఉ. బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, సీనియర్ నాయకులు పొన్నాల లక్షయ్య, కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, గణేష్ గుప్తా, ఏ జీవన్‌రెడ్డిలతో కలిసి కల్వకుంట్ల కవిత విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలు ఉన్నాయి కాబట్టే బీసీలపై ఇతర పార్టీలకు ప్రేమ వచ్చిందని, ఎన్నికలు లేనప్పుడు బీసీలపై ప్రేమ చూపించింది ఎవరనేది తెలంగాణ ప్రజలు ఆలోచిస్తారని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్‌కి ఎన్నికలు ముఖ్యం కాదని, భావితరాల భవిష్యత్తే ముఖ్యమని చెప్పారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ పార్టీ బీసీలకు చేసినంత మంచి పనులు ఏ పార్టీ చేయలేదని అన్నారు. రాష్ట్ర బిజెపి అధ్యక్షుడుగా ఉన్న ఒక బీసీ వ్యక్తిని ఎందుకు తొలగించారన్నది ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలంగాణకు వచ్చే ముందు సమాధానం చెప్పాలని అన్నారు. బీసీ అధ్యక్షుడిని తొలగించి కొత్తగా బీసీ ముఖ్య మంత్రిని చేస్తామని అంటున్నారు. ఉన్న పదవిని ఊడగొట్టి ఎట్టి పరిస్థితుల్లో అధికారంలోకి రాదని తెలిసి మరీ లేని పదవిని ఇస్తామని చెప్పడమంటే బీసీలను రాజకీయంగా మభ్యపెట్టడమే. గత ఎన్నికల్లో బిజెపి 105 స్థానాల్లో డిపాజిట్లు కోల్పోయింది. ఈసారి అన్నిచోట్ల డిపాజిట్లు కోల్పోయే పరిస్థితి ఉంది. బీసీ ముఖ్యమంత్రి ఎక్కడి నుంచి చేస్తారు? బీసీ సీఎం నినాదం కేవలం ఒక రాజకీయ నినాదం, శుష్క నినాదం, శూన్య నినాదం. అది పనికొచ్చే నినాదం కాదు అని స్పష్టం చేశారు. జనగణన చేయకుండా కాంగ్రెస్ పార్టీ అడ్డుకుందని విమర్శించారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయని పార్టీ కాంగ్రెస్ అని తెలిపారు. ఇటువంటి పార్టీ వచ్చి బీసీ డిక్లరేషన్ చేస్తే కాంగ్రెస్ చేసిన పాపాలు తొలగిపోవని, తెలంగాణ బీసీలు చైతన్యం కలిగిన వారు కాబట్టి కచ్చితంగా సీఎం కేసీఆర్ కే అండగా నిలబడతారని తేల్చి చెప్పారు.

ఎన్నికలు వచ్చినందునే ఇతర పార్టీలకు బీసీలపై ప్రేమ ఉప్పొంగుతోందని అన్నారు. 2010కి ముందు దాదాపు రూ. 4 వేల కోట్లు ఖర్చు చేసి బీసీ కులగణన చేపట్టారని, కానీ ఇప్పటి వరకు నివేదికను బహిర్గతం చేసే దమ్మూ ధైర్యం లేని పార్టీ కాంగ్రెస్ అని మండిపడ్డారు. 2010లో రాజ్యసభలో మహిళా బిల్లును ఆమోదించిన సమయంలో ఓబీసీ మహిళలకు కోటా కల్పించలేమని కూడా కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కులగణన అంటేనే ఒక అంటరాని అంశంగా బీజేపీ భావిస్తోందని విమర్శించారు. 2014లో అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం కేసీఆర్ సమగ్ర కుటుంబ సర్వే చేపట్టి రాష్ట్ర ప్రజల స్థితిగతులు తెలుసుకొని అన్ని వర్గాలకు అవసరమైన పనులను చేస్తున్నారని చెప్పారు. బీసీ కులగణన ఎందుకు చేపట్టలేకపోతు న్నదో బీజేపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఓబీసీ రిజర్వేషన్ బిల్లు పార్లమెంటులో ఎందుకు ప్రవేశపెట్టలేదని ప్రశ్నించారు. జాతీయ బీసీ కమిషన్‌ను నిర్వీర్యం చేయడం సరికాదని సూచించారు. 2004లోనే బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్యతోను తీసుకొని అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్‌ను కలిసి ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ వినతి పత్రం అందించారని, 20 ఏళ్లు గడిచినా కూడా కాంగ్రెస్, బీజేపీ పార్టీలు అంశంపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ, విశ్వవిద్యాలయాల్లో ఓబీసీ రిజర్వేషన్లను సక్రమంగా అమలు చేయకపోవడంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు.

బీసీల పట్ల కేంద్రం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా ప్రశ్నించకుండా కాంగ్రెస్ పార్టీ దేశంలో పనికిరాని ప్రతిపక్ష పార్టీగా మిగిలిపోయిందని నిప్పులు చెరిగారు. సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల పోస్టుల్లో ఎంత మంది బీసీలు ఉన్నారని రాహుల్ గాంధీ చాలా అమాయకంగా మాట్లాడుతున్నారని, గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ బీసీ, ఎస్సీ న్యాయమూర్తలు ప్రాతినిధ్యం పెంచడానికి ఎందుకు చర్యలు చేపట్టలేదని నిలదీశారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల వల్ల బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని స్పష్టం చేశారు. తమది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదని, బీసీల ప్రభుత్వమని తెలిపారు. బీసీల అభ్యున్నత కోసం అనేక కార్యక్రమాలు చేపడుతూ దేశానికి మార్గనిర్దేశం చేస్తున్న ఎకైక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

సుస్థిర వ్యవసాయం, వార్మింగ్ కంపోస్ట్ పై అవగాహన

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని అంతంపల్లి గ్రామంలో సోమవారం ఓ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుస్థిర వ్యవసాయం, వార్మింగ్ కంపోస్ట్ తయారిపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ రిసోర్స్ పర్సన్ సిద్ధ రాములు, ఫీల్డ్ వర్కర్ భూపతి మాట్లాడుతూ పాలి హౌస్ వాడే విధానం, ఉపయోగాల గురించి, ఖరీదు సబ్సిడీ గురించి రైతులకు వివరించారు. వ్యవసాయం అభివృద్ధిలో భాగంగా ఇచ్చే పని సబ్సిడీల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మధుమోహన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్నేహ, అంగన్వాడీ టీచర్ కల్పన, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీల్లో నగదు పట్టివేత

నవతెలంగాణ-భిక్కనూర్/రాజంపేట్

భిక్కనూరు మండలంలోని 44వ జాతీయ రహదారిపై స్థానిక టోల్ ప్లాజా వద్ద అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటుచేసిన చెక్ పోస్టులో వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు వాహనాలలో ఎలాంటి పత్రాలు లేని 2,81,000 వేల రూపాయలు లభించగా నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సాయి కుమార్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సందర్భంగా వాహనదారులు నగదును తరలిస్తున్న సమయంలో నగదుకు సంబంధించిన పత్రాలు ఉంచుకోవాలని సూచించారు. ఈ తనిఖీలలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రాజంపేట్ :

మండలంలోని పెద్దాయిపల్లి చౌరస్తాలో ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్నందున సోమవారం ఎస్సై సంపత్ ఆధ్వర్యంలో వాహన తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి ఆధారాలు లేకుండా 50 వేలకు పైగా నగదు తీసుకు వెళ తున్నట్టయితే వాటిని సీజ్ చేస్తామని తెలిపారు.

మైనారిటీల అభివృద్ధికి కృషి చేస్తాం

నవతెలంగాణ-సదాశివనగర్/ఎల్లారెడ్డి

మండలంలోని పద్మాజివాడి చౌరస్తాలోని దర్గాను కాంగ్రెస్ అభ్యర్థి మదన్ మోహన్ సోమవారం దర్శించుకున్నారు. అనంతరం దర్గాలో ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బి.ఆర్. యస్ మైనారిటీ లను మోసం చేసిందని అన్నారు. మైనారిటీల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మైనారిటీలతో పాటు వైస్ ఎంపిపి గాదారి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఎర్రవాటి లింగారెడ్డి సంపత్ గౌడ్, ఇర్షదుద్దీన్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మదన్‌మోహన్

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మండలంలోని మల్కాపూర్ గ్రామ ఉప సర్పంచ్ వార్డు మెంబర్లు సోమవారం ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్ మోహన్ ఆధ్వర్యంలో చేరారు. బిఆర్ఎస్ పార్టీకు చెందిన గ్రామ ఉపసర్పంచ్ లింగంలింగం , రత్నమ్మ వార్డ్ మెంబర్, సాయిలు వార్డ్ మెంబర్,స్పందన వార్డ్ మెంబర్, రమేష్ వార్డ్ మెంబర్లిగ్రామ పెద్దలు సాయిబాబా , బాలాజీ , విఠల్, సంగమేశ్వర్ తదితరులు పార్టీలో చేరారు.

విద్యార్థి, యూత్ మేనిఫెస్టో విడుదల

నవతెలంగాణ-డిచ్‌పల్లి/నిజామాబాద్ సిటీ

విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిన బిఆర్ఎస్, బిజెపి పార్టీలను అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించాలని పివైఎల్ జిల్లా కార్యదర్శి సాయినాథ్, పిడిఎస్‌యూ యూనివర్సిటీ నాయకులు అక్షయ్ విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో స్టూడెంట్ యూత్ మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజం సామాజిక, సంస్కృతిక, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి చెందాలంటే, అసమానతలు తొలగాలంటే విద్య, వైద్యం ఉపాధి కీలకమైనవని అన్నారు. పదేళ్ల కాలంలో బిఆర్ఎస్, బిజెపి పార్టీలు ఈ రంగాలను గాలికి వదిలేసి నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు. సమాజాన్ని తిరోగమనం వైపు నడిపించాయని, యువత, విద్యార్థులు, బీఆర్ఎస్, బిజెపి పార్టీలను ఓడించే విధంగా చూడాలని కోరారు. డిమాండ్ల సాధన కోసం పాలకవర్గ పార్టీలను నిలదీయాలని, వీటి కోసం పోరాడాలని సూచించారు. ప్రభుత్వ రంగంలో విద్యా, వైద్య రంగాన్ని అభివృద్ధి చేసి ప్రజలందరికీ ఉచితంగా అందించాలని, జిల్లాకు ఒక ప్రభుత్వ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ను విడుదల చేయాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సూచించారు. కార్పొరేట్ విద్యా సంస్థలను నిషేధించాలని, విద్యారంగానికి బడ్జెట్లో 30శాతం నిధులు కేటాయించాలని అన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్రంలో రద్దు చేయాలని, యూనివర్సిటీలలో విద్యార్థి ఎన్నికలు నిర్వహించాలని, ప్రైవేటు యూనివర్సిటీలను రద్దు చేయాలని, మండలానికి ఒక జూనియర్ కాలేజీ, నియోజకవర్గానికి రెండు కాలేజీలు, జిల్లాకు ఇంజనీరింగ్ కాలేజీలు నిర్మించాలని డిమాండ్ చేశారు. హాస్టల్ విద్యార్థులకు 5 వేల రూపాయల మెస్ చార్జీలు, వెయ్యి రూపాయల కాస్మోటిక్ చార్జీలు ఇవ్వాలని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే ప్రతి విద్యార్థికి ఉచితంగా బస్ పాసులు ఇవ్వాలని తెలిపారు. నిరుద్యోగంతో ఆత్మహత్య చేసుకున్న బాధిత కుటుంబానికి కోటి రూపాయల ఆర్థిక సాయం, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలని అన్నారు.



నిజామాబాద్‌సిటీ :మేనిఫెస్టోను విడుదల చేస్తున్న నాయకులు

ప్రతి నిరుద్యోగికి ఉద్యోగం వచ్చేంత వరకు నిరుద్యోగ భృతి 5000 ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ నాయకులు అక్షయ్,ఆకాష్ , దేవిక,లహరి తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ: విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిన బిఆర్ఎస్, బిజెపి పార్టీలను అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించాలని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, పివైఎల్ జిల్లా, అధ్యక్ష కార్యదర్శులు వనమల సత్యం, శ్రీనివాస్ లు విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నగరంలో మున్నూరుకాపు కల్యాణ మండపంలో స్టూడెంట్ యూత్ మేనిఫెస్టోను పిడిఎస్‌యూ, పివైఎల్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో విడుదల చేశారు. కార్యక్రమంలో పిడిఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు కార్తిక్,దేవిక, సహాయ కార్యదర్శి ప్రిన్స్, కోశాధికారి పవన్ యూనివర్సిటీ నాయకులు అక్షయ్,ఆకాష్, పివైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు బండమీద నర్సన్న, భాస్కర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కులసంఘాల గర్జనకు తరలిన మౌలాలి తాండ గ్రామస్తుల

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని మౌలాలి తాండ సర్పంచ్ జాదవ్ సునీత బాబు నాయక్ తో పాటు గ్రామస్తులు బోధనలో నిర్వహిస్తున్న కుల సంఘాల గర్జనకు సోమవారం తరలి వెళ్లారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులతో పాటు మహిళలు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన బిజెపి రాష్ట్ర కన్వీనర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన బిజెపి రాష్ట్ర కన్వీనర్, ఆర్మూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సరసం చిన్నారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు సోమవారం మోర్తాడ్ లోని ప్రజా నిలయంలో కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గం అభ్యర్థి ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. చిన్నారెడ్డి తో పాటు న్యాయవాది ప్రవీణ్, మల్లేష్ శేఖర్, పురుషోత్తం, వెంకట్, రాకేష్, అజయ్, ఉపేందర్ మరో 50 మంది పార్టీలో చేరారు. వీరందరికీ సునీల్ కుమార్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సరసం చిన్నారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గెలుపు కొరకు, ముత్యాల సునీల్ కుమార్ ను ఎమ్మెల్యేగా గెలిపించేందుకు కొరకు పని చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి తక్కూరి దేవేందర్, ఉప్లూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భీంగల్ తరలి వెళ్లిన బీఆర్ఎస్ శ్రేణులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు సోమవారం భీంగల్ బయలుదేరి వెళ్లారు. బిఆర్ఎస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ అభ్యర్థి, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు తరలి వెళ్లారు. మండలంలోని నర్సాపూర్ గ్రామం నుండి సర్పంచ్ పెండె ప్రభాకర్ ఆధ్వర్యంలో యువకులు ద్విచక్ర వాహనాలపై భీంగల్ తరలి వెళ్లారు.

ఈ కార్యక్రమానికి మండలం నుండి తరలి వెళ్ళిన వారిలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్, రాష్ట్ర నాయకులు బద్దం చిన్నారెడ్డి, పెరుమాండ్ల రాజా గౌడ్, బిఆర్ఎస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు లుక్క గంగాధర్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ బద్దం రాజేశ్వర్, హమ్మద్ హుస్సేన్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, సింగిల్ విండో చైర్మన్లు, రైతు బంధు సమితి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

భూమి, భుక్తి, విముక్తి పోరాటాలను ముందుకు తీసుకుపోదాం

నవతెలంగాణ-బోధన్

భూమి కోసం, భుక్తి కోసం నిర్వహించే విముక్తి పోరాటాలను ముందుకు కొనసాగించాలని సీపీఐఎంఎల్ న్యూ డెమొక్రసీ బోధన్ డివిజన్ కార్యదర్శి వరదయ్య అన్నారు. సోమవారం అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బోధన్ ఐఎఫ్టియు కార్యాలయంలో అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి,భుక్తి విముక్తి కోసం ఈదేశంలో నక్సల్బరి పోరాటం, శ్రీకాకుళ సాయుధ పోరాటం, గోదావరిలోయ ప్రతిఘటన పోరాటం జరిగాయని గుర్తుచేశారు. ఈ పోరాటాల ఫలితంగా నాటి పాలకవర్గాలు భూసంస్కరణల చట్టాన్ని తీసుకువచ్చాయని కానీ నేటికీ ఆ చట్టాలను అమలుచేయడంలేదని విమర్శించారు. ఇందిరాగాంధీఎమర్జెన్సీ కారు చీకట్లో అనేకమంది విప్లవ కారులను కాల్చి చంపిందని ఆవేదన వ్యక్తం చేశారు. నీలం రామచంద్రయ్య, రామనర్సయ్య, జెసిఎస్ ప్రసాద్ లాంటి అమరవీరుల ఎందరో తమ ప్రాణాలను బలిదానం చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్, ఐఎఫ్టియు, పీవైఎల్ నాయకులు, సురేష్, నజీర్, వినోద్, లక్ష్మణ్ గౌడ్, భూమన్న, దేవదాసు, సాయా గౌడ్, బాషా, పేట సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే నిరుపేదలకు అండ

- నీలాలో గడపగడపకు ప్రచారం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీల గ్రామంలో సోమవారం బీసీ సెల్ మండల అధ్యక్షులు గోసుల గంగాకిషన్, జిల్లా కిసాన్ సెల్ ఉపాధ్యక్షులు ఎమ్మెల్యే రాజు ఆధ్వర్యంలో గడపగడపకు ప్రచారానికి శ్రీకారం చుట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినట్లయితే నిరుపేదలకు అండగా ఉంటుందని వారు పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీ పథకాలతో సామాన్య మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఉపకరిస్తుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో వికలాంగుల విభాగం జిల్లా నాయకులు సద్దాం, నీలా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి సొక్కాల సాయిలు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పరీక్ష ఫీజులను మాఫీ చేయాలి

- పిడిఎస్‌యు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గిరి రాజ్ ప్రభుత్వ కళాశాలలో విద్యార్థు లందరికీ పరీక్ష ఫీజులను మాఫీ చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్‌యు ఆధ్వర్యంలో కళాశాల ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్, నగర అధ్యక్షులు ఎస్.కె. అఫ్టర్ మాట్లాడుతూ.. దూర ప్రాంతాల నుండి వస్తున్న విద్యార్థులకు ట్రాన్స్‌పోర్ట్, ప్రైవేట్ హాస్టల్, ఆహార, మెడికల్ ఇతర సౌకర్యాలు అధికంగా భారమవుతున్న నేపథ్యంలో కళాశాలలో ప్రతి సెమిస్టర్ విద్యార్థులపై ఫీజుల భారం మోపడం బాధాకరమన్నారు. ఉచిత విద్యను అందించాల్సిన ప్రభుత్వాలు, అధికారులు, విద్యార్థులపై పరీక్ష ఓల పేరిట ఫీజుల భారాన్ని మోపడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ కళాశాలలో సైతం ప్రైవేట్ కళాశాలల మాదిరి ఫీజులు వసూలు చేయడం సరికాదని వారన్నారు. పరీక్ష ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేశారు. కళాశాల నాయకులు రాజేశ్వర్, వేణు, సలీం, చరణ్, నాగేష్, నజీర్, మంగా, ప్రదీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రానికి చెందిన వ్యక్తికి రోడ్డు ప్రమాదంలో గాయాలు కాగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు బాల్కొండ ఏఎస్సై శంకర్ తెలిపారు. ఏఎస్సై వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సుంకం దశరథ్ (45) శనివారం రాత్రి తన స్కూటీతో ఎన్ హెచ్ 44 రోడ్డుపై బాల్కొండ నుండి ఆర్మూర్ వైపు వెళ్తుండగా ఎన్టీఆర్ కాలనీ వద్ద అకస్మాత్తుగా కుక్క అడ్డుగా రావడంతో దాన్ని తప్పించబోయే క్రమంలో అదుపుతప్పి కింద పడిపోయాడు. చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం దశరథ్ మృతి చెందాడు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై శంకర్ తెలిపారు.

ప్రజా సమస్యల్ని పరిష్కరించే వారికి ఓటు వేయాలి

- సిపిఐ(ఎం) డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్

నవతెలంగాణ-ఆర్మూర్

ఎన్నికల్లో ప్రజా సమస్యలను పరిష్కరించే వారికి ఓటు వేయాలని సిపిఐ(ఎం) డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ అన్నారు. పట్టణంలోని శాస్త్రి నగర్‌లోగల కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఈ నెల 30 న జరుగుతున్నాయని, ఈ ఎన్నికల్లో హామీలు కాకుండా పని చేసే వారికి ఓటు వేయాలని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం లో సీపీఎం పార్టీ 17 స్థానంలో పోటీ చేస్తుందని చెప్పారు. ఎర్ర జెండా పేదల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. సీపీఎం కు ఓటు వేయాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కుతాడి ఎల్లయ్య, డివిజన్ కమిటి సభ్యులు టీ భూమన్న, రవి, నాగరాజు, కుల్దీప్ శర్మ, నవీద్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి వెంకటేష్

కార్మికుల పర్మినెంట్‌పై మేనిఫెస్టోలో పెట్టాలి

- ఐఎఫ్‌టియు నాయకులు దాస్

నవతెలంగాణ-ఆర్మూర్

గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికుల వేతనాలు పెంచి పర్మినెంట్ అంశాన్ని రాజకీయ పార్టీలు మేని ఫెస్టోలో పెట్టాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షులు దాస్ తెలిపారు. పట్టణంలోని మామిడిపల్లి లో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుడికి నెలకు కనీసం వేతనం 21 వేల రూపాయలు వేతనం ఉండాలని ప్రభుత్వాలు ప్రకటిస్తున్నాయని తెలిపారు. కానీ 2016 అక్టోబర్ 26న సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన కేంద్రంలో ఉన్న మోడీ సర్కార్ రాష్ట్రంలో కేసీఆర్ సర్కార్ అమలు చేయలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికుల వేతన పర్మినెంట్ విషయం పైన నిర్దిష్ట ప్రకటన చేయాలని పోటీ చేస్తున్న రాజకీయ పార్టీ అభ్యర్థులను దాసు డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎండి కాజా మొయినుద్దీన్, జెపి గంగాధర్ మాట్లాడుతూ 34 రోజులు జిపి కార్మికులు సమ్మె చేసిన, చర్చల పేరుతో కేసీఆర్ ప్రభుత్వం మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాజకీయ పార్టీలు మోసపు వాగ్దానం చేయకుండా సఫాయి కార్మికులకు న్యాయం చేయాలని వారు కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ చట్టాలను వర్తింపజేయాలని, కారోబార్లకు ప్రత్యేక హోదా కల్పించాలని, డబుల్ బెడ్ రూమ్ పథకంలో ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని వారు గుర్తు చేశారు. సమావేశంలో యూనియన్ నాయకులు సొప్పరి గంగాధర్, వెంకటాపూర్ గంగారం, రాజన్న, సర్వర్ లక్ష్మి, నాగమణి, ట్రాక్టర్ మల్లయ్య, నర్సు, చిరంజీవి, గంగా సాయిలు, సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

నవతెలంగాణ-ఎడపల్లి

అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఎస్సై భూపాల విక్రమ్ ఆధ్వర్యంలో సిబ్బందితో బోధన్-నిజామాబాద్ జిరువైపులా వెళ్లే వాహనాలతో అపుతూ తనిఖీలు జరుపుతున్నారు. నెహ్రూ నగర్ నుండి మండల పరిధిలోగల అంబం గేటు వరకు ఎస్సై విక్రం బందోబస్తు ఏర్పాటు చేసి ఆయన సైతం పర్యవేక్షణ చేస్తున్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన మామిడిపల్లి యూత్ సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లికి చెందిన 30మంది యూత్ సభ్యులు సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు పండిత్ పవన్, కౌన్సిలర్ రవిగౌడ్, బిఆర్ఎస్ యూత్ సీనియర్ నాయకులు మల్యాల నర్సారెడ్డి, శ్రీకాంత్ చారి యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పేపర్ మిల్ గ్రామంలో గడపగడపకు ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలో పేపర్ మిల్ గ్రామంలో సోమవారం రెంజల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోబిన్ ఖాన్ ఆధ్వర్యంలో గడప గడపకు ప్రచారం నిర్వహించారు. రెంజల్, నీలా, బోర్గం గ్రామాలలో గడపగడపకు వెళ్లి ఆరు గ్యారెంటీ పథకాలతో బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం ముందుకు వచ్చిన కాంగ్రెస్ ను గెలిపించాలని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు జావిద్ ఉద్దీన్, మాజీ జెడ్పిటిసి నాగభూషణం రెడ్డి, సాయిబాబా గౌడ్, బీసీ సెల్ మండల అధ్యక్షులు గోసుల గంగా కిషన్, ఎమ్మెల్ రాజు పాల్గొన్నారు.

మరోసారి భారీ మెజారిటీతో గెలిపించాలి

- బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గణేష్ బిగాల

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గణేష్ బిగాల 24వ డివిజన్ గాయత్రినగర్‌లో ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం సోమవారం నిర్వహించారు. 24వ డివిజన్‌లో మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఎమ్మెల్యే గణేష్ బిగాలకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బిగాల గణేష్ గుప్త మాట్లాడుతూ.. సమైక్య పాలనలో విధ్వంసానికి గురైన తెలంగాణ రాష్ట్రాన్ని స్వరాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత నిజామాబాద్ నగరం సుందరంగా మార్చామని తెలిపారు. మౌళిక సదుపాయాలకు ప్రాధాన్యతని ఇస్తూ ప్రతి కాలనీలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేశామని అన్నారు. మిషన్ భగీరథ ద్వారా మంచి నీటి పైప్‌లైన్ నిర్మాణం చేసి ప్రతి ఇంటికి నీరు అందిస్తున్నామని తెలిపారు. నాటి పాలనలో శ్మశాన వాటిక లో సౌకర్యాల లేమితో



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి బీగాల గణేష్

ఉండేవని, నేడు సదుపాయాలతో వైకుంఠ ధామాలు నిర్మించామని తెలిపారు. సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా, నిజామాబాద్ అభివృద్దే లక్ష్యంగా పని చేస్తున్న బీఆర్ఎస్ పార్టీకి మరోసారి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతు కిరణ్, మాజీ కార్పొరేటర్ యెనుగందుల మురళి, గుజ్జెటి వెంకట నర్సయ్య, ఎస్ ఆర్ సత్య పాల్,ధర్మపురి, కస్తూరి గంగ రాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన 200మంది మహిళలు

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల సమక్షంలో 33వ డివిజన్ కి చెందిన మహిళలు 200 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతు కిరణ్ ,అంబాదాస్,నవీద్ ఇక్బల్, అబ్దుల్ కుద్దుస్, అక్బర్ హుస్సేన్, బబ్బు, సగ్గి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్: నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల సమక్షంలో జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నాగారం 300 క్వార్టర్స్ వైశ్య సంఘం నాయకులు పెద్ది మహేష్, వి.శ్రీనివాస్ సభ్యులు100 మంది బి.ఆర్.ఎస్ పార్టీ లో సోమవారం చేరారు. ప్రతి ఒక్కరు ఇంటింటికి తిరుగుతూ ఓట్లు అభ్యర్థించి బిఆర్ఎస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతు కిరణ్, సిర్ప రాజు, మాదని శ్రీధర్, పాల్తీ రవి కుమార్, చిదుర శ్రీను, కొవూరి జగన్ కసుబా సంపత్, గారిపల్లి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ అభ్యర్థి నామినేషన్ దాఖలు

నవతెలంగాణ-ముప్కాల్

నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గ ఎమ్మెల్యేగా 'ధర్మ సమాజ్ పార్టీ' (డీఎస్పీ)అభ్యర్థిగా మంగ్లారం భోజన్న అలియాస్ మహిపాల్ నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట మహేష్, కైలాస్, ఉమేష్, నిశాంత్ లు ఉన్నారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ తనను బాల్కొండ నియోజకవర్గ ప్రజలు ఆదరించి, ఆశీర్వాదం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని కోరారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న మహిపాల్

పదవ తరగతి విద్యార్థులకు సాయంకాలం ప్రత్యేక తరగతులు ప్రారంభం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



ప్రతేక తరగతులు నిర్వహిస్తున్న ఉపద్యాయులు

తెలంగాణ ప్రభుత్వం, పాఠశాల విద్యా శాఖ ఆదేశాల మేరకు ఈ విద్యా సంవత్సరం పదవ తంగతి చదువుతున్న బాల బాలికలకు సాయంత్రం ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో పదవ తరగతి విద్యార్థులకు సాయంకాలం ప్రత్యేక తరగతులను ప్రారంభించినట్లు ప్రధానో పాధ్యాయులు పసుపుల సాయన్న తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా పిల్లలను తీర్చిదిద్దాలని ప్రభుత్వం నుండి ఆదేశాలు అందినట్టు తెలియ చేశారు. ప్రత్యేక తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిఆర్‌పీలు పాల్గొన్నారు.

నా రాజకీయ జీవితం ప్రజల కోసమే

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- నా భర్త ప్రాణం కాపాడిన మంచి వ్యక్తి స్పీకర్ : సుష్మ
- ప్రచారంలో కంటతడి పెట్టిన స్పీకర్

నవతెలంగాణ-వర్ని

తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజల కోసమే నిలబడి పనిచేశానని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం రుద్రూర్ మండలంలోని అంబం, చిక్కడపల్లి, అక్బర్ నగర్, రాయికూర్, సులేమాన్ నగర్ గ్రామాల్లో ఆయన ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల కోసం నిత్యం పనిచేసే వారి నిజమైన నాయకులుగా చరిత్రలో నిలబడతారని, స్వార్థం కోసం రాజకీయాల్లోకి వస్తే గంగలో కలిసిపోతారని హితవు పలికారు. ప్రజలు



ప్రచారంలో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

ఇప్పటివరకు ఏది అడిగినా ఇచ్చానని అన్ని గ్రామాలలో సంపూర్తిగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించానని గుర్తు చేశారు. స్వయంగా ప్రజలే తమకు పథకాలు అందుతున్నాయని తెలుపుతున్నారని అన్నారు. ప్రచారంలో భాగంగా అంబం గ్రామానికి రాగానే మురళి కృష్ణ సతీమణి సుష్మ తన భర్త ప్రమాదంలో ఉంటే ఆసుపత్రిలో అన్ని తనై అండగా ఉండి ఆదుకొన్నది శ్రీనివాస్ రెడ్డి అని గుర్తు చేసి స్పీకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్త భర్తను కాపాడిన తీరు గుర్తుకు వచ్చి భావోద్వేగానికి గురై పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రజా ప్రచారం రథం లో మాట్లాడుతూ కంటతడి పెట్టారు. తాళిని కాపాడిన దేవుడు పోచారం అని సుష్మ అన్నారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా నిత్యం అండగా ఉంటున్న నాయకుడు పోచారం అని సుష్మ తెలిపారు. నియోజకవర్గ ప్రజలు తన కుటుంబ సభ్యులని, నిత్యం అండగా ఉంటూ కంటిరెప్పల కాపాడుతామని అన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, జడ్పిటిసి, ఎంపీటీసీ, ఎంపీపీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐక్యంగా డిమాండ్లను సాధించుకుందాం..

- ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇమ్మడి గోపి

నవతెలంగాణ-మోపాల్



నూతన కమిటీ సభ్యులు

ముదిరాజ్ లందరు ఐక్యంగా ఉండి డిమాండ్లను సాధించుకుందామని ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇమ్మడి గోపి అన్నారు. ముదిరాజ్ సంఘం సమావేశం సోమవారం మండలకేంద్రంలో నిర్వహించారు. ఈసమావేశానికి మండలంలోని ముదిరాజ్‌లు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇమ్మడి గోపి మాట్లాడుతూ.. ముదిరాజ్‌ల మీద బీఆర్ఎస్, బిజెపి పార్టీలు కపటప్రేమను చూపిస్తున్నాయని, ముదిరాజ్ లందరు ఎకం కావాల్సిన సమయం వచ్చిందని అన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా మంచిప్ప గ్రామానికి చెందిన దేవేందర్, ఉపాధ్యక్షులుగా నర్సింగ్ పల్లి గ్రామానికి చెందిన గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా బాడ్సి గ్రామానికి చెందిన సతీష్ , ముదక్ పల్లి గ్రామానికి చెందిన సాయిలును ఎన్నుకున్నారు.

ఇంటింటికీ ప్రచారం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ రూరల్ బీఆర్ఎస్ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు లోలం సత్యనారాయణ, మమత శేఖర్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పులి శ్రీనివాస్, పులి సాగర్, బాబు రావు తెలిపారు. సోమవారం మండలంలోని మల్లాపూర్, లోలం, ఎల్లారెడ్డిపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటికీ తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, ఈసారి నూతనంగా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రవేశ పెట్టే పథకాలను ప్రజలకు వివరిస్తున్నట్లు



ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ నాయకులు

తెలిపారు. ఎమ్మెల్యె బాజిరెడ్డి గోవర్ధన్ గత పదేళ్లుగా రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు.కారు గుర్తుకే ఓటు వేసి బాజిరెడ్డి గోవర్ధన్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ డీకోండ సరితా సుధీర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కారు గుర్తు ఓటువేసి ఆశీర్వదించాలి

- ప్రజా ఆశీర్వాద యాత్రలో జీవన్‌రెడ్డి

నవతెలంగాణ - డొంకేశ్వర్

ప్రజా ఆశీర్వాద యాత్ర లో భాగంగా మండలంలోని సిర్పూర్ (దుబ్బా) గ్రామంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జీవన్ రెడ్డి సోమవారం ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో జీవన్ రెడ్డి మాట్లాడుతూ 70 సంవత్సరాలు ఉన్న కాంగ్రెస్ ఏం చేయలేదని అన్నారు. బీఆర్ఎస్‌ను గెలిపిస్తే రైతుబంధు ఎకరానికి 16వేలు ఇస్తామని చెప్పారు. వికలాంగుల పెన్షన్ 6016 ఒంటరి మహిళలకు 5016 రూపాయల చొప్పున పెంచుతామని తెలిపారు. కారు గుర్తుకె ఓటు వేసి



ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

ఆశీర్వదించాలని కోరారు. తొమ్మిది తేదీన నామినేషన్ వేస్తానని, పెద్దఎత్తులో గ్రామ ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ లతా గణేష్, గ్రామ అధ్యక్షుడు ఎడమ దిలీప్ రెడ్డి, నందిపేట్ మండల అధ్యక్షుడు మాచర్ల సాగర్, నలిమెల గంగారెడ్డి, నలిమెల ప్రదీప్ రెడ్డి, పెంటల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి నామినేషన్ వేసిన కాసుల బాలరాజు



నామినేషన్ దాఖలు చేస్తున్న కాసుల బాలరాజు

నవతెలంగాణ-వర్ని

బాన్సువాడ నియోజకవర్గ ఇన్చార్జ్, టిపిసిసి సభ్యులు కాసుల బాలరాజ్ సోమవారం తన అనుచరులతో కలిసి మొదటి సెట్ నామినేషన్ పత్రాలను బాన్సువాడ ఆర్డీవో కార్యాలయంలో దాఖలు చేశారు. ముందుగా వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ముహూర్తం ప్రకారం నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాన్సువాడ నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని, సభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డి అభివృద్ధి పేరుతో దోచుకుంటున్న విషయం ప్రజలకు అర్థమైపోయిందని అన్నారు. బాన్సువాడతోపాటు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు కాలేక్, మాజీ జిల్లా కిసాన్ కేత్ అధ్యక్షులు హనుమాన్లు, పట్టణ అధ్యక్షులు శేఖర్ రెడ్డి, బీర్కూర్ మండల అధ్యక్షులు బోయిని శంకర్, బాన్సువాడ అధ్యక్షులు మంత్రి గణేష్, మండల అధ్యక్షులు రూప్ సింగ్, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ దాఖలు చేసిన మంత్రి ప్రశాంత్ రెడ్డి

- భారీగా తరలివచ్చిన టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు

నవతెలంగాణ-భీంగల్

బాల్కొండ నియోజకవర్గ స్థానానికి ఎమ్మెల్యే అభ్యర్థిగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సోమవారం తన నామినేషన్ దాఖలు చేశారు. అంతకు ముందు వేల్పూర్ లోని తన స్వగ్రామం లోని పెద్దమ్మ గుడిలో తన సతీమణి వేముల నీరజ రెడ్డి తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి బస్సులో భీంగల్‌కు చేరుకుని నామినేషన్ దాఖలు చేశారు. తన సతీమణి వేముల నీరజ రెడ్డి, రాజ్యసభ సభ్యులు కేతిరెడ్డి సురేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్, హెల్త్ అండ్ వెల్ఫేర్ చైర్మన్ మధుశేఖర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేశ్వర్ లతో కలిసి నామినేషన్ కేంద్రానికి చేరుకున్నారు. నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిత్ర మిశ్రాకు అందజేశారు. మూడో సారి తన విజయం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు.



అభివాదం చేస్తున్న మంత్రి వేముల

వడ్డిమోహన్‌రెడ్డి నామినేషన్ దాఖలు

నవతెలంగాణ-బోధన్

అసెంబ్లీ ఎన్నికల సంధర్బంగ బోధన్ అసెంబ్లీ స్థానానికి సోమవారం బీజేపీ అభ్యర్థి మోహన్ రెడ్డి రెండు సెంట్ల నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్డిఓ రాజాగౌడ్ నామినేషన్లు స్వీకరించారు.మోహన్ రెడ్డి వెంట నాయకులు బాలరాజు, నర్సింహారెడ్డి, సుధాకర్ చారి తదితరులు ఉన్నారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న మోహన్‌రెడ్డి

కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్‌రెడ్డి తొలి సెట్ దాఖలు

నవతెలంగాణ-భీంగల్

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 3న ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ భాగంగా బాల్కొండ నియోజకవర్గ స్థానానికి భీంగల్ పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన నామినేషన్ కేంద్రంలో నాలుగవ రోజు సోమవారం తొలి నామినేషన్ దాఖలు అయ్యాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ముత్యాల సునీల్ రెడ్డి తరపున పార్టీ నాయకుడు సుంకెట రవి, బొదిరె స్వామి పార్టీ నాయకులతో కలిసి నామినేషన్ దాఖల పత్రాన్ని రిటర్నింగ్ అధికారి చిత్రమిశ్రాలకు అందజేశారు. నామినేషన్ కేంద్రం వద్ద భీంగల్ సీఐ వెంకటేశ్వర్లు ఎస్సై హరిబాబుల ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



మాట్లాడుతున్న నాయకులు

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-మోర్తాడ్

మండల కేంద్రానికి చెందిన పలువురు బిఆర్ఎస్ నాయకులు సోమవారం ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీలో చేరారు. టెలికాం డైరెక్టర్ తక్కురి సతీష్, తోబాటు పలువురు పార్టీలో చేరినట్లు తెలిపారు. సొంతగూటికి రావడం సంతోషంగా ఉందని కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందుతాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ప్రజలందరికీ వివరిస్తూ బాల్కొండ నియోజకవర్గం తోబాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తేవడానికి తమ వంతు ప్రచారం నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలోకి భారీ చేరికలు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు ముస్కు ముత్తెన్న, మాజీ సర్పంచ్ పోలీస్ పృథ్వివల్లబ్‌లతో పాటు మరి కొంతమంది కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండలంలోని రెంజర్ల గ్రామం నుంచి యాదవ సంఘం, రజక, గంగపుత్ర సంఘాల నుంచి దాదాపు 200 మందికి పైగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సునీల్ రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాధారంగా ఆహ్వానించారు. అనంతరం సునీల్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గెలుపు కొరకు కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యం రెడ్డి, కిసాన్ ఖేత్ అధ్యక్షులు బద్దం సాగర్ రెడ్డి, డీసీసీ కార్యదర్శి జైడి రవి, ఉపాధ్యక్షులు రాజ్ కుమార్, సాజిద్, ఏలేటి రాములు, లోక సుభాష్, ఆరేపల్లి లక్ష్మణ్, తిరుపతి రెడ్డి, శ్రీకాంత్, రాజేశ్వర్ గౌడ్, మల్లారెడ్డి, విజయ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, సందీప్, ముజ్జు, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



సునీల్ కుమార్ ఆధ్వర్యంలో పలువురు చేరిక

సభాస్థలి పరిశీలించిన ఎమ్మెల్యే షకీల్

నవతెలంగాణ-బోధన్

ఈ నెల 15న ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బోధన్‌లో నిర్వహించే ప్రజా నివేదిక సభకు హాజరు కానుండడంతో సోమవారం ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ అంబం గేటు, నర్సపూర్ ఆంజనేయ స్వామి మందిర్ వద్ద గల స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట బోధన్ బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్, అంబం సర్పంచ్ గంగప్రసాద్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సత్యం, రజాక్ ఉన్నారు.



బీఆర్ఎస్‌లో చేరికలు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని కులాస్‌పూర్ గ్రామంలోని దాదాపు 50 మంది వివిధ పార్టీల నుంచి s సర్పంచ్ మమతా సాయి రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారందరికీ ధర్పల్లి జెడ్పిటిసి బాజీరెడ్డి జగన్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామం ఒకప్పుడు అభివృద్ధికి నోచుకోలేదని, ఇప్పుడు గోవన్న ఎమ్మెల్యే అయిన తర్వాత గ్రామంలో సిసి రోడ్లు కానీ, డ్రైనేజీలు, గాని వైకుంఠధామాలు ఎంతో అభివృద్ధి చెందాయని అన్నారు. అభివృద్ధిని చూసి వివిద పార్టీలకు చెందిన ప్రజలు స్వచ్ఛందంగా పార్టీలో చేరారని ఆయన తెలిపారు. కచ్చితంగా గోవన్నకు తమ గ్రామంలో అధిక మెజార్టీ వస్తుందని అన్నారు. కార్యక్రమంలో మోపాల్ మండల అధ్యక్షుడు మోచ్చ శ్రీనివాస్, షకీల్, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పిటిసి బాజీరెడ్డి జగన్

జీవన్‌రెడ్డిని పడగొట్టేది నేనే

- ఆర్మూర్ కాంగ్రెస్ అభ్యర్థి వినయ్ రెడ్డి

నవతెలంగాణ-మాక్లూర్

వచ్చే ఎన్నికల్లో జీవన్ రెడ్డిని ఓడించి పడగొట్టేది నేనేనని ఆర్మూర్ కాంగ్రెస్ అభ్యర్థి పొద్దుటూరి వినయ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కొత్తపల్లి, గుంజిలి, చిక్లి, వల్లభాపూర్, మెట్ పల్లి గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థి వినయ్ రెడ్డి గడప గడపకు ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటి ఇంటికి తిరుగుతూ తనకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ఓటర్లను కోరారు. ఇప్పటి వరకు బీఅర్ఎస్ పార్టీ అభ్యర్థికి అవకాశం ఇచ్చారని దానివల్ల గ్రామాల్లో ఎక్కడ కూడా అభివద్ధి జరుగలేదని తెలిపారు. డబుల్ బెడ్ రూం ఇండ్లు, అర్హులకు పింఛాన్, రేషన్ ఇవ్వలేదని, ప్రతి గ్రామంలో అర్హులకు ఇండ్లు కటిస్తానని హామీ ఇచ్చారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివద్ధే కనిపిస్తుందని, బిఆర్ఎస్ పార్టీ చేసిన పనులు కనిపించడం లేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఇచ్చే అరు పథకాల పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఒక్క సారి చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రవి ప్రకాష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేశ్వర్ రావు, జిల్లా నాయకులు డేగ పోషెట్టి, గంగాధర్ గౌడ్, పీర్ సింగ్, పురుషోత్తం, విఠల్, కష్ణ రావు, శేకర్, జైల్ సింగ్, భారత్, మైనార్టీ మండల అధ్యక్షులు ఆలిం, సందీప్, దోర్త రాజేందర్, మాజీ ఎంపిటిసి బోజన్నా, అరుణ్, రంజాన్, రమేష్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి వినయ్‌రెడ్డి

బిఆర్ఎస్ పార్టీ నుంచి పలువురు కాంగ్రెస్ లోకి చేరిక

మండలంలోని సింగిల్ విండో మాజీ చైర్మన్, ప్రస్తుత డైరెక్టర్ దయాకర్ రావు బీఅర్ ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి ఆర్మూర్ అభ్యర్థి వినయ్ రెడ్డి సమక్షంలో కండువా వేసుకున్నారు. ఆయనతో పాటు సుమారు 20 మంది యువకులు పార్టీలో చేరారు.

నవతెలంగాణ

వెంకట్రామిరెడ్డి సస్పెండ్‌ను నిరసిస్తూ.. పలువురు రాజీనామా



నవతెలంగాణ-పిట్లం

మండలంలోని చిన్న కొడప్ గల్ బీఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఎంపీటీసీ సుగురెడ్డి వెంకట్రామిరెడ్డిని పార్టీ నుండి సస్పెండ్ చేసి నందుకు నిరసిస్తూ సింగిల్ విండో పరిధిలోని ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పార్టీ సభ్యత్వానికి సోమవారం రాజీనామా చేశారు.

ఎన్నికల నేపథ్యంలో అధికార పార్టీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ఆదివారం మండలం లోని చిన్న కొడప్ గల్ సింగిల్ విండో పరిధిలోని అల్లాపూర్, బుర్గాపూర్, పరడ్ పల్లి, గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా కొందరు అడ్డుకున్నారు. ఆయన తీరుతోనే ప్రజలు అడ్డుకున్నారని సస్పెండ్ చేసినట్టు సమాచారం.

ఆయన వర్గీయులు సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ మొగుల గౌడ్, మాజీ సర్పంచ్ అమ్మద్దీన్, మాచి ఉపసర్పంచ్ మల్లప్ప పటేల్ మాట్లాడుతూ గతంలో తామందరము టిడిపి పార్టీలో ఎమ్మెల్యే హన్మంత్ షిండే తో కలిసి పార్టీ అధిష్టానం సూచన మేరకు పనిచేసి ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నామన్నారు. గత సింగిల్ విండో ఎన్నికలలో రెండు గ్రూపులు ఏర్పడిన పార్టీ అధిష్టానము మేరకు పనిచేశామన్నారు. అయినప్పటికీ తమ ఎంపీటీసీ సుగురెడ్డి వెంకట్రామిరెడ్డి ని సస్పెండ్ చేయడం దారుణమన్నారు. పార్టీలో ఈరోజు ఒకరు, మరో రోజు ఒకరు ఇదే పంత కొనసాగించవచ్చుననే దృఢవిశ్వాసంతో మూకుమ్మడి రాజనామలకు తెర లేపామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన సుమారు 100 మంది పార్టీ కార్యకర్తలు , నాయకులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాం ప్రారంభం

నవతెలంగాణ-సదాశివనగర్

కెపిఎఫ్‌సిఎల్, ఐకెపి ఆధ్వర్యంలో సదాశివనగర్ మండలంలోని లింగంపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేం ద్రాన్ని సోమవారం ప్రారంభించారు.కామారెడ్డి జిల్లాలోని పలు మండలాల్లో ఉన్న కేపీ ఎఫ్‌పిఎల్ సభ్యులు 2009 నుంచి ఈ సంఘం ఏర్పాటు చేసుకున్నారని, ఈ సంఘంలో 2600 మంది సభ్యులతో ఈ సంఘం కొనసాగిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఏపిఎం రాజిరెడ్డి, కెపిఎఫ్‌సిఎల్ చైర్మన్ ఎమ్‌ఎమ్ రాజు, వైస్ చైర్మన్ శ్రీహరి, డైరెక్టర్ బలవంత రావు, మోహన్ రావు, సాయిలు, మోహన్ రావు, మధుసూదన్ గ్రామస్తులు, సెక్రటరీ స్వరూప, ఏఈఓ హరిక, సెంటర్ ఇంచార్జ్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ అండర్-17కు నలుగురు ఎంపిక



ఎంపికైన విద్యార్థినిలు

నవతెలంగాణ-గాంధారి

కామారెడ్డి జిల్లా స్థాయి కబడ్డీ అండర్ 17కు నలుగురు పోతంగల్ కలాన్ క్రీడాకారిణిలు ఎంపిక అయినట్టు ఉపాధ్యాయులు తెలిపారు. సోమవారం ఎల్లారెడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జరిగిన జోనల్ స్థాయి కబడ్డీ అండర్ 17విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోతంగల్ కు చెందినా ఇసత్, సంధ్య, సౌమ్య, ప్రణితలు ఎంపిక అయినట్టు వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్ రాథోడ్ తెలిపారు, ఎంపిక అయిన క్రీడాకారిణి లకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రంగారావు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

వీధికుక్కల దాడి

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని మల్లూరు గ్రామంలో పిచ్చి కుక్కలు ప్రజలను కాటు వేస్తున్నాయి. మూడు రోజుల నుండి పిచ్చికుక్కలు 15 మందిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. సోమవారం ఆరుగురిని కరిచాయని గ్రామస్తులు తెలిపారు. కుక్కలను తరిమేయాలని జీపీ కార్యదర్శికి విన్నవించినా తన చేతిలో ఏమీ లేదని దాటివేసే ప్రయత్నం చేస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నపిల్లలు ఆరు బయట ఆడుతున్నప్పుడు పిచ్చికుక్కలు మీద పడి దాడి చేస్తే బాధ్యులు ఎవరని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఒక అధికారి స్థానంలో ఉండి ఇలా మాట్లాడటం సరికాదని వాళ్ళు అన్నారు. దీనికి సంబంధించి అధికారులు వెంటనే స్పందించి పిచ్చికుక్కల విహారం నుండి చిన్న పిల్లలను గ్రామ ప్రజలను కాపాడాలని ప్రజలు వేడుకుంటున్నారు.

కాంగ్రెస్ సత్తా చాటుదాం

- కాంగ్రెస్ అభ్యర్థి మదన్ మోహన్

నవతెలంగాణ-గాంధారి

కాంగ్రెస్ శ్రేణుల సత్తా ఏంటో ఎమ్మెల్యే జాజాల సురేందర్‌కు చూపాలని కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్ అన్నారు. గాంధారి మండల కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో వివిధ మండలాల్లో వివిధ గ్రామాల బిఆర్‌ఎస్ బీజేపీ నాయకులు పెద్దసంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గాంధారి మండలానికి చెందిన బిఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర మాజీ టి ఎస్ ఆర్ వి జనరల్ సెక్రటరి మోతిలాల్ జాదవ్ , సోమారం తండా సర్పంచ్ కిషన్, ఉపసర్పంచ్ మోతిరం, దుర్గం మాజీ సర్పంచ్ వసంత్ రావు, సొసైటీ డైరెక్టర్ సంతోష్, సురేందర్ వీరితో పాటు వివిధ గ్రామాలలో బీజేపీ, బిఆర్‌ఎస్ పార్టీలకు చెందిన నాయకులు ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి మదన్ మోహన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

రూపాయి రూపాయి చందాలు వేసుకొని గెలిపించిన కార్యకర్తలు, నాయకులను నమ్మి టికెట్ ఇచ్చిన పార్టీ అధిష్టానాన్ని, సోనియా గాంధీని జాజుల సురేందర్ మోసం చేశాడని అన్నారు. ఈ ఎన్నికల్లో జాజాలకు డిపాజిట్ కూడా రాకుండా చేసి ఆయన రాజకీయ జీవితాన్ని బొంద పెట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మదన్ మోహన్

సంక్షేమ పథకాలు గెలిపిస్తాయి

- బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

నవతెలంగాణ-లింగంపేట్/ఎల్లారెడ్డి

ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ పార్టీని అభ్యర్థిని గెలిపిస్తాయని నాయకులు అన్నారు. పలు మండలాల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు.

లింగంపేట్: మండలంలోని సురాయపల్లి, సూరయ్య పల్లి తండా, జగదంబ తండాలో గిరిజన తండాల్లో మండల బిఆర్ఎస్ కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను బిఆర్ఎస్ అధ్యక్షులు దివిటి రమేష్ ఓటర్లకు వివరించారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలంలోని సోమార్ పెట్, మౌలాన్ ఖేడ్ గ్రామాల్లో సోమవారం బి ఆర్ ఎస్ నాయకులు ఇంటి ఇంటికి తిరుగుతూ బి ఆర్ ఎస్ మేనిఫెస్టోలోని అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, మండల అధ్యక్షుడు జలందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అధిములం సతీష్, డి సి సి బి డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి,జడ్పీటీసీ ఉష గౌడ్, కౌన్సిలర్ నీల కంఠం తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్: మండలం లోని తిమ్మోజివాడి, కల్వరాల్ తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో పొన్న పెద్ద నర్సయ్య రవిందర్ రెడ్డి, సాకలి రాజయ్య నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.



లింగంపేట్ : ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

రామారెడ్డి: మండలంలోని ఇసన్న పల్లి సోమవారం బి ఆర్ ఎస్ పార్టీ ఇంటింటి ప్రచారాన్ని సీనియర్ నాయకులు కందూరి పెద్ద లింబాద్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్రం వచ్చిన తర్వాత, కెసిఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, మరింత అభివృద్ధి చెందాలంటే కారు గుర్తుకు ఓటు వేసి బి ఆర్ ఎస్ పార్టీని గెలిపించాలని అన్నారు. 60 సంవత్సరాలు పాలించిన కాంగ్రెస్ రాష్ట్రానికి ఏం చేసిందో చెప్పి ఓట్లు అడగాలని, మతాల మధ్య చిచ్చు పెడుతూ, రాజకీయ లబ్ధి పొందాలని బిజెపి ఆరటపడుతుందని, ప్రజలు ఈ పార్టీలను నమ్మవని, వచ్చే ఎన్నికల్లో బి ఆర్ ఎస్ పార్టీ గెలిచి, తెలంగాణ ప్రజల సేవలో ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు లింగాపురం శంకర్, సిద్దం బైరయ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కనీస అభ్యసన స్థాయిలను సాధించాలి



నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ మాట్లాడుతూ విద్యార్థులలో కనీస అభ్యసన స్థాయిలను పెంచడానికి ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు పరుస్తున్నామని ఇంకా ఎక్కడైనా లోపాలు ఉన్నట్లు ఉంటే వాటిని సవరించు కొని ఎఫ్.ఎల్.ఎన్ ను ముందుకు తీసుకుపోవాల్సిన అవసరము ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయుల పైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి నాంపల్లి మల్లేశం, స్కూల్ కాంప్లెక్స్ సెక్రెటరీ శివాజీ, స్కూల్ కాంప్లెక్స్ మాజీ ఎఫ్.ఏ.సి.హెచ్ఎం భీమవ్వ, హెచ్ఎంలతో పాటు ఉపాధ్యాయులు సి.ఆర్.పి లు జ్యోతి, మల్లికార్జున్ పాల్గొన్నారు.

తారు రోడ్డు మొత్తం మట్టిమయం



నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని మాగి గేటు నుండి అన్నారం గేట్ వరకు రోడ్డు మొత్తం మట్టిమయం అయింది. దీనివల్ల వడ్డేపల్లి, మల్లూరు, అన్నారం గ్రామ ప్రజలు తీవ్రంగా అనారోగ్య పాలు అవుతున్నారు. రెండు సంవత్సరాల క్రితం నాగమడుగు ఎత్తిపోతల పథకం మంజూరైన సందర్భంగా భారీ వాహనాలు ఈ రోడ్ల వెంబడి వెళ్లి రోడ్లన్నీ పాడైపోయాయి. ఆ ప్రాజెక్ట్ కాంట్రాక్టు తీసుకున్న మెగా కంపెనీ కొన్ని రోజులు వాళ్ళ వాహనాలు తిరిగినప్పుడు వాటర్ ట్యాంకర్ తో వాటర్ క్యూరింగ్ చేశారు. మళ్ళీ కొన్ని రోజులు పని ఆగిపోగానే వాటర్ క్యూరింగ్ చేసేది ఆపేశారు. దీనివల్ల ఏ చిన్న వాహనం వెళ్లిన భారీగా దుమ్ము ధూళి వస్తుంది. దీనివల్ల రోడ్డుకు నివసించే కుటుంబీకులు శ్వాసకోశ సమస్యకు గురవుతున్నారని గ్రామాలలోని ప్రజలు పేర్కొంటున్నారు. ఈ విషయంపై ఆయా గ్రామాలలో అధికారులకు ప్రజలు వినతి పత్రం ఇవ్వగా చేసేది మా చేతిలో ఏమీ లేదని వాళ్ళు పేర్కొన్నారు. వెంటనే సదరు అధికారులు స్పందించి వాటర్ క్యూరింగ్ లేదా కొత్త రోడ్డును నాణ్యతగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎన్నికల ప్రచారానికి జడ్పీటీసీ దూరం!

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

పెద్దకొడప్‌గల్ మండలానికి చెందిన అధికార పార్టీ జెడ్పిటిసి చంద్రభాగ.. బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్‌షిండే ప్రచారానికి దూరంగా ఉండటం స్థానికంగా చర్చనీయాంశం అవుతుంది. రెండు రోజులుగా మండలంలో వివిధ గ్రామాల్లో షిండే ప్రచారం చేపట్టినా.. జడ్పీటీసీ దూరంగా ఉండటం గమనార్హం.

ఎంత సొంత పనులు బిజీ ఉన్న ఎన్నికల సమయంలో మాత్రం అందరు కలిసి కట్టుగా పని చేస్తారు. కానీ జడ్పిటిసి చంద్రభాగ మాత్రం ఈ కార్యక్రమానికి దూరంగా ఉండటంతో అంత చర్చనీయాంశంగా మారింది. ఇలా దూరంగా ఉండటంతో మండలంలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు ప్రస్తుత జడ్పిటిసిగా ఉన్న చంద్రభాగా వేరే పార్టీల వైపు మొగ్గు చూపుతున్నరని వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో కూడా పలు అభివృద్ధి కార్యక్రమాలు మండలంలోని వివిధ గ్రామాలలో శంకుస్థాపన కార్యక్రమాలకు కూడా జడ్పిటిసి హాజరు కాకపోవడంతో అనుమానాలకు తావిస్తుంది. ఎటువంటి అధికారిక కార్యక్రమాలకు కూడా హాజరు కాలేదు. జడ్పిటిసి చంద్రభాగ స్థానంలో వారి భర్త ప్రభుత్వ ఉద్యోగి అయిన ఇందల్ సింగ్ ఆమె స్థానంలో కార్యక్రమాలకు హాజరయ్యారు. జడ్పిటిసి ఎన్నికల సమయంలో పలు తాండాలలో ఇచ్చిన హామీలు నెరవేర్చకపో వడంతో తండాలలో తిరుగుతే జనాలు తరిమి కొట్టే అవకాశం ఉండడంతో వ్యతిరేకత వస్తుందని ముందుగానే పసిగట్టిన ఆమె ప్రచారానికి రాలేదని సొంత పార్టీలో గుసగుసలాడుతున్నారు. కానీ కాయితీ లంబాడాలను ఎస్టీ జాబితాలో చేర్పాలని రోడ్లపై ధర్నాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన సభలకు ఆమె హాజరైనట్టు తెలుస్తుంది. జెడ్పిటిసిగా ఉన్న చంద్రభాగ పలు గ్రామాల ప్రజలకు అయితే ఏకంగా తను ఎలా ఉంటదో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. వచ్చే ఎన్నికల్లో నైనా సరైన అభ్యర్థిని జడ్పిటిసిగా నియమించుకొని ప్రజలకు అందు బాటులో ఉండి ప్రజల అవసరాలు తీర్చే వాళ్ళని జడ్పిటిసిగా గెలిపిస్తామని మండల ప్రజలు పేర్కొంటున్నారు.



షిండే పక్కన కానరాని జడ్పీటీసీ

నేడు షబ్బీర్‌అలీకి స్వాగతం పలుకుతూ బైక్ ర్యాలీ

- విజయవంతం చేయాలి : టిపిసిసి ఉపాధ్యక్షులు తాహెర్, కాంగ్రెస్ నగర అధ్యక్షుల కేశవేణు


మాట్లాడుతున్న తాహెర్‌బిన్ హందాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మహమ్మద్ అలీ షబ్బీర్‌ని నియమించడంతో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే బైక్ ర్యాలీ బహిరంగ సభను విజయవంతం చేయాలని టిపిసిసి ఉపాధ్యక్షులు తాహెర్‌బిన్ హందాన్, నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కేశ వేణు పిలుపునిచ్చారు. సోమవారం కాంగ్రెస్ భవన్ నందు పిసిసి ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ హందాన్, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశ వేణు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాహెర్ బిన్ హందాన్ మాట్లాడుతూ.. మహమ్మద్ అలీ షబ్బీర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా మొదటిసారి నిజామాబాద్ కు వస్తున్న సందర్భంగా ఆయనకు ఘన స్వాగత బైక్ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని, అన్నారు. బోర్గం బ్రిడ్జి వద్ద ర్యాలీ ప్రారంభం అవుతుందని తెలిపారు. అనంతరం నెహ్రూ పార్క్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశ వేణు మాట్లాడుతూ.. ర్యాలీలో ప్రజల అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన అన్నారు. సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, మొహమ్మద్ నయీం అలీ, నజీబ్ అలీ, డాక్టర్. శివ ప్రసాద్,యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గోపి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విక్కీ,జిల్లా ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు వేణు రాజ్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విపుల్ గౌడ్,రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు జావేద్ అక్రమ్, గడుగు రోహిత్, జిల్లా మైనారిటీ అధ్యక్షులు ఇర్ఫాన్ అలీ తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి తరలిన ప్రజాప్రతినిధులు, నాయకులు

నవతెలంగాణ-ఎడపల్లి

బోధన్ పట్టణంలో నియోజకవర్గ శాసనసభ్యులు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మహమ్మద్ షకీల్ అమేర్ సోమవారం ఆత్మీయ సమ్మేళన ఏర్పాటుచేశారు. బోధన్ నియోజకవర్గ పరిధిలోని బోధన్, ఎడపల్లి, రెంజల్, నవీపేట్, సాలూర మండలాలకు చెందిన అన్ని కులాల మహిళలు, యువకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. సర్పంచులు దుబ్బాక సావిత్రి రవీందర్ గౌడ్, ఆకుల మాధవి శ్రీనివాస్, బట్టు హనుమాన్లు, ఎడపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ మాణిక్యాల సురేష్ గౌడ్, సర్పంచుల సంఘం ఎడపల్లి మండల అధ్యక్షులు గంగా ప్రసాద్, జెడ్పి వైస్ పర్సన్ రజిత యాదవ్, ఎంపీపీ కే శ్రీనివాస్,.. ఎంపీటీసీల ఫోరం ఎడపల్లి మండల అధ్యక్షులు వెంకయ్య గారి రామిరెడ్డీ, ఎడపల్లి, జైతపూర్ సహకార సంఘాల అధ్యక్షులు పోలమల్కారెడ్డి, కరటూరి సత్యనారాయణ తరలివెళ్లారు.


కుర్నాపల్లినుండి వెళ్తున్న నాయకులు


పార్టీ కండువాలు వేస్తున్న భూపతిరెడ్డి

భూపతి రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో 1200 మంది చేరిక

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భూపతిరెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 1200 మంది పలు పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ జక్రాన్‌పల్లి మండల కార్యకర్తల సమావేశం మండల కేంద్రంలోని అరుంధతి ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. రూరల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ ఆర్ భూపతిరెడ్డికి మండలం ప్రజలు ఘన స్వాగతం పలికారు. భూపతి రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 1200కు వివిధ పార్టీల వారు కాంగ్రెస్‌లో చేరారు. జక్రాన్‌పల్లి మాజీ సర్పంచ్ నర్సారెడ్డిసైతం చేరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి బంగ్లా వసంతరావు, మండల యువజన విభాగం అధ్యక్షుడు వినోద్, మున్నెల్లి సర్పంచ్ సాయిరెడ్డి, గన్న లక్ష్మణ్, తిపిరి జనార్ధన్, గన్న శ్రీనివాస్, మోతె సాయిలు, సుంకరి బెంజిమెన్, సుంకర శ్రీనివాస్, తలారి డేవిడ్, సైకిల్ అక్బర్, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

హెచ్‌ఎం ప్రవర్తనపై నివేదిక అందించాలి

- వనతెలంగాణకు స్పందన
- ఎంఇఓపై డీఈఓ ఆగ్రహం
- విచారణ చేపట్టిన ఎంఇఓ

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని చల్లగర్గ గ్రామములోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం విద్యార్థులకు మధ్యాన భోజనంలో పురుగులు వచ్చిన విషయంపై అడిగేందుకు వెళ్లిన సర్పంచ్ పై అమర్యాదగా ప్రవర్తించిన ప్రధానోపాధ్యాయునిపై సోమవారం డీఈఓ దుర్గ ప్రసాద్ ,మండల విద్యాధికారిపై ఆగ్రహం వెక్తం చేశారు. విచారణ చేసి త్వరగా నివేదిక అందించాలని ఆదేశించినట్లు తెలిసింది. దీంతో ఎంఇఓ శ్రీనివాస్ రెడ్డి ఉదయం పాఠశాల సందర్శించి జరిగిన ఘటనపై గ్రామస్థులు, విద్యార్థులతో అడిగి తెలుసుకొని సర్పంచుపై అమర్యాదగా ప్రవర్తించిన ఉపాధ్యాయునికి ప్రవర్తన మార్చుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు ఉపాధ్యాయుని తరపున మండల విద్యాధికారి సారి చెప్పినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా వంట మనిషి విషయంలో విద్యార్థులను అడిగి తెలుసుకోగా ప్రతిరోజు ఇలాగె ఉంటుందని తెలుపడంతో వంటమనిషికి మార్చుకోవాలని సూచించినట్లు సర్పంచ్ గాదె సవిత తెలిపారు. త్వరగా


విచారణ చేపడుతున్న ఎంఈవో

ఎస్ఎంసి కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లి తండ్రలతో సమావేశం ఏర్పాటు చేసుకొని వెంటనే వంట వారిని మర్చి మరొకరికి పెట్టుకోవాలని తెలిపినట్లు ,రెండు రోజుల్లో సమావేశం ఏర్పాటు చేసుకొని వంట మనిషికి మార్చనున్నామని అన్నారు. కార్యక్రమములో వార్డు సభ్యులు,ఇతర గ్రామస్థులు ఉన్నారు.

సుదర్శన్ రెడ్డి గెలుపు ఖాయం

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు

నవతెలంగాణ-ఎడపల్లి

సుదర్శన్‌రెడ్డి గెలుపు ఖాయమని కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు అన్నారు. మండలంలోని జానకంపేట గ్రామంలో సోమవారం ఎడపల్లి మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో నాయకులు గడపగడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు విజయ్ కుమార్ గౌడ్, రాధకష్ణ మోహన్ గౌడ్ మాట్లాడారు. త్వరలో బోధన్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ రెడ్డి భారీ మెజారిటీతో గెలవడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పక్కగా అమలు చేయలేకపోయారని వారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కుటుంబ పాలననే తప్ప మిగతా మంత్రులకు ఎమ్మెల్యేలకు పూర్తిస్థాయిలో నిధులను సైతం మంజూరు చేయలేకపోవడం బాధాకర విషయం అన్నారు. సంక్షేమ పథకాలు అధికార పార్టీ నాయకులకి చేరాయని ఆరోపించారు. కార్యక్రమంలో తాళ్లపల్లి విజయ్ కుమార్ గౌడ్ రాధాకష్ణ గౌడ్, జహీర్ ఖాన్, అశ్వ క్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మూడు నామినేషన్లు దాఖలు

నవతెలంగాణ-భీంగల్

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 3న ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియలో భాగంగా బాల్కొండ నియోజకవర్గ స్థానానికి భీంగల్ పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన నామినేషన్ కేంద్రంలో నాలుగవ రోజు సోమవారం మూడు నామినేషన్లు దాఖలు అయ్యాయి. బీఆర్ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్ రెడ్డి రాజ్యసభ సభ్యుడు సురేష్ రెడ్డితో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ముత్యాల సునీల్‌రెడ్డి తరపున పార్టీ నాయకుడు సుంకేట రవి బొదీరే స్వామి పార్టీ నాయకులతో కలిసి నామినేషన్ పత్రాన్ని రిటర్నింగ్ అధికారి చిత్రమిశ్రాకు అందజేశారు. డీఎస్పీ పార్టీ అభ్యర్థిగా మంగళవారం భోజన్న నామినేషన్ వేశారు. నామినేషన్ కేంద్రం వద్ద భీంగల్ సీఐ వెంకటేశ్వర్లు ఎస్సై హరిబాబు ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు

నామినేషన్‌కు మద్దతుగా వెళ్లిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-ముప్కాల్

బాల్కొండ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల ప్రశాంత్ రెడ్డి సోమవారం నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా ముప్కాల్ మండలం నుంచి బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యువజన సంఘం నాయకులు మద్దతుగా భీంగల్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీపీ సామ పద్మ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ బాల్కొండ ఎమ్మెల్యేగా తిరిగి వేముల ప్రశాంత్ రెడ్డి హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని అన్నారు. వెళ్లిన వారిలో జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సవ్వ-నర్సారెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్, ప్రధాన కార్యదర్శి ఉమ శంకర్, వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న, కో అప్షన్ సభ్యులు మునిరోద్దీన్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షులు, ఉన్నారు.

కాసులకే టికెట్ ఖరారయ్యేనా?

నవతెలంగాణ-వర్ని

నేడు, రేపు అంటూ బాన్సువాడ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోసం ఎదురు చూస్తుండగా కాసుల బాలరాజు కు టికెట్ ప్రకటించకపోయినా పక్క తనకే అధిష్టానం తననే ప్రకటిస్తుందని మంచి రోజు ఉందని నామినేషన్ వేశారు. ఎన్నికల అధికారికి సోమవారం కాసుల బాలరాజు మొదటి నామినేషన్ దాఖలు చేశారు. అధిష్టానం దష్టిలో అప్పటి నుంచి తానే ఉన్నాననే ధీమాతో టికెట్ క్లారిటీ చేసుకొన్నారు. దీంతో పలు మండలాల్లో టపాసులు కాల్చి మిఠాయిలు పంచుకొన్నారు. ఇదిలా ఉండగా మరి కొందరు కాంగ్రెస్ పార్టీ ప్రజాపతినిధులు కార్యకర్తలు ఆశ్చర్య పోతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తనకే టికెట్ పక్కా ఇస్తుందని నమ్మకంతో మొదటి నామినేషన్ దాఖలు చేసినట్టు అనుచరులు అంటున్నారు. అయినప్పటికీ ఇంకా బాన్సువాడ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ టికెట్ సస్పెన్స్ యే.

పోచారం శ్రీనివాస్‌రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలి

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలో సోమవారం కోటగిరి బిఆర్ఎస్ అధ్యక్షులు కులకర్ణి అనిల్ ఆధ్వర్యంలో పోచారం శ్రీనివాస్ రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రచారం నిర్వహించారు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి శ్రీనివాస్ రెడ్డి అభివద్ధికి విశేషమైన కషి చేశారని పోచారం శ్రీనివాస్ రెడ్డిని గెలిపించుకోవలసిన ఆవశ్యకతను ఓటర్లకు వివరించి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కోటగిరి విండో అధ్యక్షులు కూచిసిద్దు, బీఆర్ఎస్ నాయకులు హవగిర్ పటేల్ పాల్గొన్నారు.

నవీపేట్‌లో పోలీసుల కవాతు


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-నవీపేట్

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ ద్వారా మండల కేంద్రంలో సోమవారం నిర్వహించారు. శాసనసభ ఎన్నికల సందర్భంగా ఎన్నికలు స్వేచ్ఛ మరియు పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ కషి చేస్తుందని అన్నారు. ఏదైనా ఫిర్యాదులు ఉంటే ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ నార్త్ రూరల్ సిఐ సతీష్ కుమార్, ఎస్సై యాదగిరి గౌడ్ పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే షిండే

అభివృద్ధిని గుర్తించి

మరోసారి ఆశీర్వదించండి

- ప్రచార సభలలో హన్మంత్ షిండే

నవతెలంగాణ-పిట్లం

జుక్కల్ నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిని గుర్తించి కారు గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి హన్మంత్ షిండే కోరారు. సోమవారం మండలంలోని బొల్లక్‌పల్లి, మద్దెలచెరువు, బండపల్లి, కోమటి చెరువు తాండ, గౌరరం, గౌరారం తాండ , రాంపూర్ , కుర్తి గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి గతంలో ఏ ప్రభుత్వాలు అమలు చేయని పథకాలు ప్రవేశపెట్టి ప్రజలకు అందించారన్నారు. ఆడపిల్లల పెళ్ళిళ్లకు కళ్యాణ లక్ష్మి పథకం రూ.51 వేలతో ప్రవేశపెట్టి అంచలంచలుగా లక్ష 116 రూపాయలను అందించినట్టు గుర్తుచేశారు. వృద్ధులకు , వితంతు, ఒంటరి , చేనేత , గీత , బీడీ కార్మికులకు 2016 రూపాయలను పెన్షన్ రూపంలో అందిస్తున్నా మన్నారు. వికలాంగులకు 3016 రూపాయల నుండి ఇటీవలే 4016 రూపాయలకు పెంచి అందిస్తున్నా మన్నారు. మూడవసారి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఆసరా పెన్షన్ లకు 4016 , వికలాంగులకు 5016 రూపాయలకు పెంచి అందిస్తున్నట్టు తెలిపారు. కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు పంపిణీ చేసిన ఘనత కెసిఆర్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. తాము అధికారంలోకి మూడవసారి వచ్చిన వెనువెంటనే రైతుబంధు ఆర్థిక సహాయం పదివేల నుండి 16 వేల రూపాయలకు పెంచి అందించనున్నట్టు తెలిపారు. అందుకుగాను ప్రతి ఒక్కరూ తమను ఆశీర్వదించి మూడవసారి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయా గ్రామాల ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు , సర్పంచులు , ఎంపీటీసీలు , సింగిల్ విండో చైర్మన్లు , వైస్ చైర్మన్లు , పార్టీ శ్రేయోభిలాషులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదరించండి రెట్టింపు అభివృద్ధి చేస్తా

- ఇచ్చిన మాట నెరవేర్చడమే సీఎం కేసీఆర్ ఘనత
- బీఆర్ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్‌రెడ్డి



మంత్రి ప్రశాంత్‌రెడ్డికి పూలమాలవేస్తున్న నాయకులు

నవతెలంగాణ-భీంగల్

ప్రేమతో ఆదరించండి రెట్టింపు అభివృద్ధి చేస్తానని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. సోమవారం భీమ్‌గల్‌లో ర్యాలీ నిర్వహించారు. బడా భీంగల్ సుభాష్ విగ్రహం నుండి ర్యాలీ ముచ్కూర్ చౌరస్తా వరకు కొనసాగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. గతంలో తాను ప్రజలకు ఇచ్చిన హామీలను వందశాతం నెరవేర్చడం జరిగిందన్నారు. నియోజకవర్గ ప్రజలు తనను ఆదరించాలని, మరింత బాధ్యత తో పని చేస్తానని హామీ ఇచ్చారు. నామినేషన్ సందర్భంగా నియోజకవర్గం ప్రజలు తరలి వచ్చి చూపిన అభిమానం ముందు తాను ఎంత చేసినా తక్కువేనని పేర్కొన్నారు. మీరెంత అభిమానం చూపితే తాను అంతకు రెట్టింపు ప్రేమతో పనిచేస్తానని హామీ ఇచ్చారు. నామినేషన్‌కు తరలి వచ్చిన అభిమానులు ఒక్కొక్కరు కేసీఆర్, వీపీఆర్‌లా మారి ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించి ఓట్లు అడగాలని పిలుపునిచ్చారు. కారు గుర్తుకు ఓటు వేయించే బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని కోరారు. ఈ సారి గెలిస్తే లింబాద్రి గుట్టను మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. పోచంపాడ్ ప్రాజెక్టును టూరిజం స్పాట్ గా చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కమ్మర్ పల్లి మండలం చౌట్పల్లి హన్మంత్ రెడ్డి ఎత్తిపోతల పథకంలో వినియోగించిన మట్టి పైప్‌లు లీకేజీ అవుతున్నాయని వాటి స్థానం లో రూ 150 కోట్లతో స్టీల్ పైప్ లు వేయించేం దుకు కృషి చేస్తానని అన్నారు. వీటన్నిటిని పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని, మరోసారి ఆశీర్వదించాలని, పనులు చేసే బాధ్యత తనదని చెప్పారు. కమిట్మెంట్ ఇచ్చిన ప్రతి పనిని కమిట్మెంట్‌తోనే పూర్తి చేస్తానని భరోసా ఇచ్చారు.

ఇచ్చిన హామీలన్ని నెరవేరుస్తాం...

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు అండగా నిలవాలని మంత్రి కోరారు. అధికారంలోకి రాగానే ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం జరుగుతుందన్నారు. భూమి లేని పేదలకు బీమా సౌకర్యం, సౌభాగ్య లక్ష్మీ ద్వారా 3000, సిలిండర్ 400, పింఛన్ ను రూ. 2000ల నుండి రూ 5000 వరకు దశల వారిగా ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతు బంధు ను ప్రతి యేటా పెంచుతూ రూ ఎకరానికి 16వేలు చేస్తామని అన్నారు. అభివద్ధి కొరకు పని చేసే వారికే పట్టం కట్టాలని కోరారు. అనంతరం లింబాద్రి గుట్టకు చేరుకున్న మంత్రి శ్రీ లక్ష్మీ నరసింహునికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట నాయకులు కేతిరెడ్డి సురేష్ రెడ్డి, డాక్టర్ మధు శేఖర్, రాజేశ్వర్, మార గంగారెడ్డి, మున్సిపల్ చైర్మన్ కన్నె ప్రేమలత, కన్నె సురేందర్, పట్టణ అధ్యక్షులు మల్లెల లక్ష్మణ్, ఎంపీపీ ఆర్మూర్ మహేష్, జడ్పీటీసీ చౌట్పల్లి రవి, గున్వీర్ రెడ్డి, మొయిస్ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం

నవతెలంగాణ-కోటగిరి

మండలంలో సోమవారం సాయంత్రం తుఫాన్ ప్రభావంతో వర్షం పడటంతో ధాన్యం తడిసింది. ప్రభుత్వ వరి ధాన్యం కొనుగోలు నత్త నడకన సాగటం, ప్రైవేటు రైస్ మిల్ యజమానులు ధర తగ్గించడంతో రైతులు ఆరబెట్టిన ధాన్యం వర్షానికి తడిసింది. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



తడిసిన ధాన్యం

యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ల స్థానచలనం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలోని అసిస్టెంట్ రిజిస్ట్రార్లు గా పదవుల్లో కొనసాగుతున్న సాయ గౌడ్, విజయలక్ష్మి లకు స్థానచలనం చేశారు. సాయ గౌడ్ గతంలో ఎగ్జామ్ బ్రాంచ్, ఇష్టబ్లిష్మెంట్ సెక్షన్ బాధ్యతలు నిర్వహించారు. సారంగాపూర్ బీఈడీ కాలేజ్ లో విజయలక్ష్మి అసిస్టెంట్ రిజిస్ట్రార్ గా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం అసిస్టెంట్ రిజిస్ట్రార్ విజయలక్ష్మికి ఎగ్జామినేషన్ బ్రాంచ్ బాధ్యతలు అప్పగించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయి గౌడ్‌కు ఇష్టబ్లిష్మెంట్ సెక్షన్ పూర్తి బాధ్యతలు అప్పగించారు.

25 లక్షల 73 వేల నగదు స్వాధీనం

- ఏసిపి కిరణ్ కుమార్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగనావర్ ఐపీఎస్ ఆదేశాల మేరకు నిజామాబాద్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణం సీఐ నరహరి నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సంజీవ్, సిబ్బంది ఎల్లమ్మ గుట్ట ఏరియాలో అక్రమంగా తరలిస్తున్న 25 లక్షల 73 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆధారాలు లేకుండా తరలిస్తున్నటు మోర దీపక్ అనే వ్యక్తి వద్ద నుంచి 25లక్షల 73వేల డబ్బును సోమవారం స్వాధీనపరుచుకొని ఐటీ అధికారులకు అప్పగించనున్నట్టుగా ఏసిపి నిజామాబాద్ కిరణ్ కుమార్ చెప్పారు. నగదును స్వాధీన పరచుకోవడంలో ప్రతిభ కనబరిచిన పట్టణ సీఐ నరహరి, నాలుగవ పట్టణ ఎస్సై సంజీవ్, సిబ్బంది రామకృష్ణ, రమేష్‌లను ఎసిపి అభినందించారు.

నిరుద్యోగులు, విద్యార్థులు, యువత

కేసీఆర్ సర్కార్‌కు బుద్ధి చెప్పేందుకు సిద్ధం కావాలి

- విద్యార్థి సంఘాల పిలుపు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

యువతను మోసం చేస్తు నిరుద్యోగులను బలి తీసుకున్న కేసీఆర్ సర్కార్‌కు బుద్ధిచెప్పేందుకు నిరుద్యోగులు, విద్యార్థులు, యువత సిద్ధం కావాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమావత్ లాల్‌సింగ్ అన్నారు. టివియువి, టిజివిపి, గిరిజన విద్యార్థి సంఘం, తెలంగాణ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో టివియువి కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌కు ఎందుకు ఓటువేయాలని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న



మాట్లాడుతున్న నాయకులు

రెండు లక్షల ఉద్యోగ పోస్టు భర్తీ చేయనందుకా... ఉద్యోగ నోటిఫికేషన్ పేరిట నిరుద్యోగుల వద్ద నుంచి వేలాది రూపాయలు దోచుకున్నందుకా...? ఉద్యోగుల జాబ్ క్యాలెండర్ ప్రకటించనందుకా...? చదువుతున్న విద్యార్థులకు ఫీ-రీయింబర్స్మెంట్ ఇవ్వనందుకా..? నిరుద్యోగుల ప్రాణాలు బలి తీసుకున్నందుకా..? నిరుద్యోగులకు భతి చెల్లించనందుకా..? బి.ఆర్.యస్. మేనిఫెస్టో లో ఉద్యోగాలు అంశం పెట్టనందుకా..? ప్రశ్నా పెపర్లు లీకేజీ చేసినందుకా..? పరీక్షలు రద్దు చేసినందుకా..? అని అన్నారు. నిరుద్యోగులు, విద్యార్థులు భారత రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థులను ప్రశ్నించాలని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ తీరును బూత్ స్థాయిలో ప్రచారం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు జైత్రాం రాథోడ్, టిజివిపి జిల్లా అధ్యక్షులు కళ్యాణ్, టి.యస్.యఫ్ జిల్లా నాయకులు సుభాష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యాసన సామర్థ్యం పెంచేందుకు తొలిమెట్టు

- ప్రిన్సిపల్ డాక్టర్ కె ప్రవీణ్ కుమార్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

పిల్లల్లో అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తొలిమెట్టు రూపొందించిందని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ కె.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎల్లారెడ్డిలోని డిగ్రీ కాలేజీలో సోమవారం 'పిల్లల కోసం తొలిమెట్టు' కమ్యూనిటీ మూమెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ ప్రోగ్రాంను తెలంగాణ ప్రభుత్వం రూపొందించిందని కమిషనర్ వాకాటి కరుణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ట్రైనింగ్ ఇచ్చి ప్రైమరీ స్కూల్ లలో చదువుతున్న వెనుకబడిన విద్యార్థులకు బేసిక్ ఎడ్యుకేషన్ నేర్పించడం కోసం విద్యార్థులకు ట్రైనింగ్ ఇస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎల్లారెడ్డి నందు ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ అండ్ టు ప్రోగ్రాం ఆఫీసర్స్ బి కృష్ణ ప్రసాద్, ఎస్ గోదావరి 100 మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు ట్రైనింగ్ ఇచ్చారని ప్రిన్సిపల్ తెలిపారు.

జంపింగ్ జిలానీలు

మొన్న బీఆర్ఎస్.. నేడు బీజేపీలోకి

నవతెలంగాణ-రామారెడ్డి

మనుషులు ఎంత సులభంగా పార్టీలు మారుతున్నారని ప్రజలే ముక్కున వేలేసుకుంటున్నారు. పార్టీ సిద్ధాంతాలను నాయకులు లెక్కచేయడం లేదు. మండల కాంగ్రెస్ యూత్ ప్రెసిడెంట్ చింతకుంట కిషన్ గురువారం కాంగ్రెస్ పార్టీని వీడి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారం గడపకముందే తిరిగి వడ్డేపల్లి సుభాష్ రెడ్డి సమక్షంలో సోమవారం బీజేపీ కండువాను కప్పుకున్నారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ... వడ్డేపల్లి సుభాష్ రెడ్డి సొంత మనిషినని, మాయ మాటలు చెప్పి బి ఆర్ ఎస్ నాయకులు బలవంతంగా గులాబీ కండువా కప్పారని, దళిత బంధు, తాయిలాలకు తలవంచనని, చివరి శ్వాస వరకు సుభాష్ రెడ్డి తోనే ఉంటానని అన్నారు.



బీజేపీ కండువా కప్పుకున్న కిషన్